ప్రమాదకరంగా ప్రధాన రహదారి

- ఒకవైపు గుంతలు.. మరోవైపు పేరుకుపోయిన మట్టిదిబ్బలు
- రహదారిపై కానరాని సైన్‌బోర్డులు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు


కురుమపల్లి కూడలి వద్ద రహదారిపై గుంతలు

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల మీదుగా వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా తయారైంది. ధర్మారం క్రాస్‌రోడ్డు నుంచి బసంత్‌నగర్ విమానాశ్రయం వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా మారింది. దాదాపు 50 ఏళ్ల క్రితం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం ఆధ్వర్యంలో క్రాస్‌రోడ్డు నుంచి విమానాశ్రయం వరకు సీసీరోడ్డు నిర్మించారు. ఇటీవల ఈ రహదారిపై ఓవర్‌లోడ్ లారీల రాకపోకలు ఎక్కువ కావడంతో రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఒకవైపు రహదారిపై గుంతలు, మరోవైపు పేరుకుపోయిన మట్టి దిబ్బలతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కురుమపల్లి గ్రామ బస్టాండ్ కూడలి వద్ద రహదారిపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. మరోవైపు కన్నాల క్రషర్ల నుంచి నిత్యం వెలుబడే దుమ్ము రహదారిని కప్పేస్తుండటంతో రహదారిపై పేరుకుపోయిన దుమ్ము మట్టిదిబ్బలుగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు.

ఓవర్‌లోడ్ లారీలు.. క్రషర్ల దుమ్ము

మండలంలోని జయ్యారం, ధర్మారం మండల పరిధిలోని రచ్చపల్లి గుట్టల నుంచి కన్నాల బోడ గుట్ట క్రషర్లకు పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం లారీలతో బండరాళ్ల సరఫరా జరుగుతోంది. లారీల్లో పరిమితికి మించి దాదాపు 30 నుంచి 40 టన్నుల వరకు ఓవర్‌లోడ్‌తో బండరాళ్లను తీసుకువస్తుండటంతో రహదారి దెబ్బతిని గుంతలమయంగా మారుతోంది. గోదావరిఖని, ఎన్టీపీసీ, రామగుండం పట్టణాల నుంచి వివిధ పనుల నిమిత్తం జగిత్యాల జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనదారులు ఈ రహదారినే వినియోగిస్తుంటారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. అయితే రహదారి నిర్వహణ సరిగ్గా లేని కారణంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.


కన్నాల క్రషర్ల వద్ద ప్రధాన రహదారిపై పేరుకుపోయిన దుమ్ము

కానరాని సైన్‌బోర్డులు..

నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే ఈ రహదారిపై అధికారులు అవసరమున్న చోట సైన్‌బోర్డులు ఏర్పాటు చేయలేదు. మూలమలుపుల వద్ద, బ్రిడ్జిల వద్ద ముందస్తు సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో వేగంగా వచ్చే వాహనదారులకు మూలమలుపులు కానరాక ప్రమాదాల బారిన పడుతున్నారు. బసంత్‌నగర్ విమానాశ్రయం సమీపంలో ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ స్థలంలో వాహనాలు అదుపుతప్పి నేరుగా ఎదురుగా ఉన్న ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు వ్యక్తులు మృతిచెందగా, పదుల సంఖ్యలో వాహనదారులు గాయాలపాలయ్యారు. తరచూ వాహనదారులు తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నా ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై గుంతలను పూడ్చి మూలమలుపుల వద్ద సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా క్రషర్ల వద్ద రహదారిపై పేరుకుపోయిన మట్టికుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓవర్‌లోడ్ లారీలతోనే రోడ్డు ధ్వంసం



మాది రామారావుపల్లి.పెద్దపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తుంటాను. ప్రతి రోజు బైక్ మీద కాలేజీకి వెళ్తుంటాను. ఓవర్‌లోడ్ లారీలతో మండల రహదారి దెబ్బతింటోంది. ముఖ్యంగా క్రషర్ల వద్ద రహదారిపై పేరుకుపోయిన మట్టి కుప్పలు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలి.

– బీస సదానందం, లెక్చరర్

గుంతలు పూడ్చాలి



మా గ్రామ కూడలి మూలమలుపు వద్ద ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళల్లో వాహనదారులు ఈ గుంతలు కానరాక అదుపుతప్పి పడిపోతున్నారు. గుంతల్లో డస్టు, కంకర మిక్సింగ్ నింపి పూడ్చుతున్నప్పటికీ ఓవర్‌లోడ్ లారీల మూలంగా తిరిగి గుంతలు ఏర్పడుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఇదే సమస్య ఎదుర్కొంటున్నాం. అధికారులు ఓవర్‌లోడ్ లారీలను నియంత్రించి గుంతలు పూడ్చాలి.

– కదారి హరీశ్, కురుమపల్లి

క్లుప్తంగా

సీఎం కేసీఆర్‌కు ‘కోలేటి’ సన్మానం


సీఎం కేసీఆర్‌ను సన్మానిస్తున్న కోలేటి

గోదావరిఖని: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పోలీస్ హౌజింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ గురువారం సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేసీఆర్‌ను కలిసి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెప్పించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిమ, ప్రసాదాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి అభినందించారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు ఎలకలపల్లి, గుంటూరు పల్లి ప్రధాన రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మంథని: హమాలీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు 29న హైదరాబాద్‌లోని లేబర్ కమిషన్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. గురువారం మంథని ప్రధాన చౌరస్తాలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. నాయకులు ఆర్ల సందీప్, గొర్రెంరల సురేశ్, రంగు శంకర్, శ్రీను, రాజయ్య,పుల్లయ్య, బాపు తదితరులు ఉన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగికి దళితరత్న అవార్డు


అవార్డు అందిస్తున్న మంత్రి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగి రాసపల్లి సంపత్ దళితరత్న అవార్డు అందుకున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా సంపత్ అవార్డు అందుకున్నారు. రామగుండం ప్రాంత దళితుల అభ్యున్నతికి గుర్తింపుగా రాసపల్లి సంపత్‌కు ప్రతిష్టాత్మక దళితరత్న అవార్డు అందించారు. అవార్డు రావడంపై సంపత్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మాతాశిశు పారిశుధ్య సిబ్బందికి వేతనాలిప్పించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు వేతనాలివ్వడం లేదని, 83 మందికి అవకాశం ఇచ్చి సగం మందికి ఇప్పటికీ నియామక పత్రాలు ఇవ్వలేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం కలెక్టర్ సంగీతను కలిసి వినతిపత్రం అందించారు. కూటి కోసం పనిచేసే పారిశుధ్య కార్మికులకు 9 నెలలుగా వేతనాలందక కుటుంబపోషణ జరగక పస్తులుండాల్సిన పరిస్థితులేర్పడ్డాయన్నారు. ఈ విషయమై విచారణ జరిపి వెంటనే వేతనాలను చెల్లించాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, తిరుపతి, రియాజ్, శారద, సాగర్, పారిశుధ్య కార్మికులున్నారు.

పోస్టాఫీసుల్లో ఆసరా పింఛన్ల పంపిణీ


సేవింగ్ సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రభాకర్

ధర్మారం: ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ రకాల పింఛన్లను ఇక నుంచి పోస్టాఫీసు నుంచి అందిస్తామని సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ తెలిపారు. ధర్మారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించి మహిళలకు సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మార్చికి సంబంధించిన ఆసరా పింఛన్లను ప్రభుత్వం విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు. పోస్టాఫీసుల్లో పదివేల రూపాయల వరకు ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా అందించనున్నట్లు ఆయన వివరించారు. జిల్లాలోని 375 పోస్టాఫీసులల్లో 28 పోస్ట్ మ్యాన్‌లకు మైక్రో ఏటీఎం సౌకర్యం ఉందన్నారు. ఐపీపీబీ, ఏఈపీఎస్ సౌకర్యంతో ఏదైనా బ్యాంకు ఖాతా నుంచి నగదును తీసుకోవచ్చన్నారు. పెన్షన్‌దారులు పోస్టాఫీసు వెళ్లి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బ్రాంచి పోస్టు మ్యాన్‌లు, మహిళలు పాల్గొన్నారు.

బీఎస్పీ అధికారంలోకి వస్తే కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం


పార్టీలో చేరిన మహిళలతో దాసరి ఉష

కాల్వశ్రీరాంపూర్: బీఎస్పీ అధికారంలోకి వస్తే కుటీర పరిశ్రమలను ప్రోత్సహించి యువతకు, మహిళలకు ఉపాధి కల్పిస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. గురువారం కాల్వశ్రీరాంపూర్‌లో పలువురు మహిళలు బీఎస్పీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అగ్రవర్ణాలకు ఎమ్మెల్యే పదవులు కట్టబెడితే బడుగు, బలహీన వర్గాలు వెనుకబడి పోతున్నాయని, బహుజనులు అధికారంలోకి వస్తేనే సమ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్, మహిళా కన్వీనర్ శారద, నాయకులు రియాజ్, కిరణ్, శ్రీలత, లావణ్య, జ్యోతి,రమ్య, రజనీకాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మే డే వేడుకలను ఘనంగా నిర్వహించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో గురువారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు మార్త రాములు మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం 138 ఏళ్ల క్రితమే చికాగో పోరాట ఫలితమేనన్నారు. మే డే వేడుకలకు అధిక సంఖ్యలో కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉడుత శ్రీనివాస్, తూళ్ల గట్టయ్య, కొమురయ్య, మంద శ్రీనివాస్, మంథని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఏసీపీ పరామర్శ

మంథని: పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దుబాసి రమేశ్ కుటుంబాన్ని గురువారం పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ , సీఐ ప్రదీప్‌కుమార్ పరామర్శించారు. అడవి శ్రీరాంపూర్‌కు చెందిన రమేశ్ తండ్రి రాజమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు పరదాలు పంపిణీ

ఎలిగేడు: అకాల వర్షాలకు, వడగండ్ల వానలకు ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామానికి చెందిన ఊట్ల నర్సయ్య, బాసంపల్లి రమేశ్ ఇండ్లు ధ్వంసమై ఇంటిలోకి నీరు చేరింది. బాధిత కుటుంబాలకు కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మీనర్సయ్య పంపించిన పరదాలను గురువారం కేసీఆర్ సేవాదళం సభ్యులు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి శాతల్ల కాంతయ్య, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బొద్దుల సాయినాథ్, రాజు, పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో బట్ట సంచుల పంపిణీ

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశం ఆధ్వర్యంలో గురువారం వారసంతలో బట్ట సంచులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్,శాతల్ల కాంతయ్య, తదితరులు ఉన్నారు.

ఇద్దరి బైండోవర్

జ్యోతినగర్: ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలతో ఇళ్లు నిర్మించుకున్న ఇద్దరు మహిళలను రామగుండం తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన మాతంగి రజిత, శనిగరపు సారమ్మ నకిలీ పట్టాలతో ఇళ్లు నిర్మించుకున్నట్లు విచారణలో తేలడంతో ఇద్దరిని తహసీల్దార్ జాహెద్ పాషా ఎదుట హాజరుపర్చగా ఆరు నెలల జైలు శిక్ష, లక్ష రూపాయల మేరకు బైండోవర్ చేసినట్లు ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ తెలిపారు.

‘సల్లగుండవే యాదున్న’ పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: దోస్తానా క్రియేషన్స్ ఆధ్వర్యంలో యూట్యూబ్ చానల్‌లో రూపొందించిన సల్లగుండవే యాదున్న లఘుచిత్ర పాటను గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సతీశ్, జేఎస్‌టీయూహెచ్ కన్వీనర్ వివేక్, ముదిరాజ్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న చేతుల మీదుగా పాట ప్రచారప్రతులను విడుదల చేశారు. డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ దాసరి తిరుపతి, రచయిత నాగరాజు, మేకల భరత్, రాజేందర్, జబర్దస్త్ శ్రీకాంత్ తదితరులున్నారు.

30న ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లిలో ఈనెల 30న ఉదయం 10.59 గంటలకు రామాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు సర్పంచ్ గోనె శ్యాం, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేత్రదానం అభినందనీయం

కమాన్‌పూర్: రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన కేశెట్టి రమణయ్య కళ్లను దానం చేయడం అభినందనీయమని సదాశయ ఫౌండేషన్ కార్యదర్శి లింగమూర్తి అన్నారు. గురువారం కల్వచర్లలో రమణయ్య సంస్మరణ సభను నిర్వహించి కళ్లు దానం చేసిన రమణయ్య కుటుంబ సభ్యులను అభినందించారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సైండ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

కురుమపల్లిలో పోచమ్మ బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

పాలకుర్తి: పెద్దపల్లి మండలం కురుమపల్లిలో యాదవ కులస్తులు గురువారం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. గ్రామంలో బీరప్ప కొలుపు, పట్నాల సందర్భంగా తొలిరోజు గ్రామంలోని యాదవ కుటుంబాలకు చెందిన మహిళలు బోనాలతో ఒగ్గుడోలు కళాకారుల నృత్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు గొర్రె రాయలింగు, కాల్వ రాయలింగు, అరిగెల రాజయ్య, బూస కొంరయ్య, పోలవేని గంగయ్య, మూసరి స్వామి, కుల బాంధవులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం


కొత్తపల్లిలో స్వామివారి కల్యాణం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన చెరకు మహేందర్‌రెడ్డి, పద్మజ దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణమాచారి, సత్యనారాయణ, శ్రీనివాస్, ఉపేందర్ కల్యాణవేడుక నిర్వహించారు.

ధర్నా విజయవంతం చేయాలి

రామగుండం: హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు, తదితర సమస్యల పరిష్కారానికి ఈనెల 29వ తేదీన హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం రామగుండం పట్టణ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ, రామగుండం ఏరియా కమిటీ కో కన్వీనర్ టి.మల్లేశ్, సీఐటీయూ నాయకులు కనకయ్య, సత్యనారాయణ, సతీశ్, ఎల్లయ్య, పోశం, వెంకటేశ్, లక్ష్మీనారాయణ, మల్లేశ్, కృష్ణ తదితరులున్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టుపై వెలగని ఫ్లడ్‌లైట్లు


ప్రాజెక్టు రహదారిపై చిమ్మచీకట్లు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్లు వెలుగకపోవడంతో చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత ప్రాజెక్టు పరిసరాలు చీకటిమయం అవుతున్నాయి. వేసవి కాలంలో సాయంత్రం ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రాజెక్టును వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి ప్రాజెక్టు ప్రధాన రహదారితో పాటు స్పిల్‌వేకు ఉన్న ఫ్లడ్‌లైట్లు వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

ఆలయంలో వైభవంగా అధ్యయనోత్సవం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం అధ్యయనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి


నివాళి అర్పిస్తున్న సగర సంఘం సభ్యులు

గోదావరిఖనిటౌన్: స్థానిక సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూల మాలలు సమర్పించారు. కార్యక్రమానికి రాష్ట్ర సగర సంఘం ఉపాధ్యక్షుడు కనుకుల మొండయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భగీరథ మహర్షి జయంతి రోజున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం తమను గుర్తించి జయంతిని అధికారికంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సగర సంఘం ప్రధాన కార్యదర్శి కురుమ శ్రీనివాస్,కోశాధికారి అంకాల రాజమౌళి,సంఘం నాయకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రాయయ్యపల్లెలో ఉప్పర సంఘం ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మహర్షి ఆలోచన విధానాలను పాటించాలని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవునూరి రజిత, ఉప్పరి సంఘం నాయకులు దేవునూరి తిరుపతి, శ్రీనివాస్, సదానందం, గాండ్ల సుధాకర్, ఓదెలు, శంకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

యైటింక్లయిన్‌కాలనీ: దళారులను నమ్మి మోసపోవద్దని కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజలింగు అన్నారు. బుధవారం రామగిరి మండలం సుందిళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ ఆరెల్లి దేవక్క, సంఘం చైర్మన్ భాస్కర్ రావు,సర్పంచ్ లక్ష్మితో కలసి ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, సహకార సంఘం డైరెక్టర్ తార, రైతుబంధు అధ్యక్షుడు ఓదెలు, నాయకులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ 18వ డివిజన్ పరిధిలోని అల్లూరులో గురువారం డివిజన్ కార్పొరేటర్ బాదే అంజలీదేవి, సింగిల్ విండో డైరెక్టర్ కళావతి, కాలనీ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మేడి సదయ్య ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి బాలరాజు, వ్యవసాయ అధికారి ప్రకాశ్, సొసైటీ పీవో రమేశ్, రమణ, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

పాలకుర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బామ్లానాయక్‌తండా, కన్నాల, జీడీనగర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మనోహర్‌రెడ్డి ప్రారంభించారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు బదావత్ రాజునాయక్, ఎంపీటీసీ అతిఖ్, నాయకులు పుప్పాల దయానందం, కరీం, నాగుల వంశీ, సింగిల్‌విండో డైరెక్టర్లు గణపతి శ్రీనివాస్, రవి, షకీలాల్, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

సుల్తానాబాద్‌రూరల్: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంట, అల్లీపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను గురువారం ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంత, రవీందర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు రాజమల్లయ్య, తదితరులున్నారు.

రచ్చపల్లిలో..

ధర్మారం: మండలంలోని రచ్చపల్లిలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాలవర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సర్పంచ్ మోర సుధాకర్, ఎంపీటీసీ బెల్లాల రోజారాణి, ఏపీఎం తులసీ, నాయకులు చింతల తిరుపతి, బైరి సురేశ్, రైతులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి


ధాన్యం పరిశీలిస్తున్న సునీల్ రెడ్డి

మంథని: తడిచిన ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేలు చెల్లించాలని బీజేపీ నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంథని మండలం నాగారం, కన్నాల గ్రామాల్లో గురువారం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. తడిసిన ధాన్యానికి తేమ ఇతర కారణాలు చెప్పవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. అకాల వర్షంతో నష్టపోయిన వరి, మిర్చి,మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ కో-కన్వీనర్ నాంపల్లి రమేశ్, మండల ఇన్‌చార్జి వీరబోయిన రాజేందర్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి బోయిని నారాయణ పాల్గొన్నారు.